జేఈఈ మెయిన్స్... దాదాపు 12 లక్షలమంది రాసే ఇంజినీరింగ్ ప్రవేశపరీక్ష! ఏప్రిల్ 8న ఆఫ్‌లైన్‌లోనూ, ఏప్రిల్ 15, 16 తేదీల్లో ఆన్‌లైన్‌లోనూ జరగబోతోంది. మంచి ర్యాంకులు సాధించాలంటే ప్రిపరేషన్ పట్టు సడలకుండా సాగాలి. ఈ సందర్భంగా పరీక్ష దగ్గర పడుతున్న కొద్దీ తుది సన్నద్ధతకు సంబంధించి గణితం, రసాయనశాస్త్రాల్లో ముఖ్యాంశాలను మెరుగ్గా ఎలా పునశ్చరణ చేసుకోవాలో చూద్దాం!

పరపాట్లు సవరణ పదేపదే పునశ్చరణ

కొత్తగా అయిదు ఎన్‌ఐటీలు ఈ ఏడాది వస్తున్నాయి. దీంతో మొత్తం 31 ఎన్‌ఐటీలు, 23 ఐఐటీలు, 23 జీఎఫ్‌ఐటీలు అన్నింటిలో సుమారు 30,000కుపైగా ఉన్న సీట్లకు జేఈఈ మెయిన్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ ప్రవేశపరీక్షలో ఎనిమిది లక్షల మందికిపైగా విద్యార్థులు పై కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధిస్తున్నారు. మొత్తం సీట్లలో 27% ఓబీసీ, 15% ఎస్‌సీ, 7.5% ఎస్‌టీ వారికి, 3% దివ్యాంగులకు కేటాయించిన విషయం తెలిసిందే.

గత 5 సంవత్సరాల జేఈఈ మెయిన్ కటాఫ్ మార్కులు..

కేటగిరీ	2017	2016	2015	2014	2013
జనరల్	81	100	105	115	113
ఓబీసీ	49	70	70	74	70
ఎస్‌సీ	32	52	50	53	50
ఎస్‌టీ	27	48	44	47	45

జేఈఈ మెయిన్ - 2018 తుది సన్నద్ధత సూత్రం

ట్రిగనామెట్రీ, వెక్టార్స్, 3డీ: వీటి నుంచి మిగిలిన శాతం ప్రశ్నలు వస్తాయి. ఈ అధ్యాయాల్లో కూడా అడిగే ప్రశ్నలన్నీ ఎక్కువ శాతం స్టాండర్డ్, ఫార్ములా బేస్డ్. కాబట్టి వీటిలో ఉన్న ప్రతి ఫార్ములానూ ఒకటికి రెండుసార్లు ముఖ్యంగా ఇన్వర్స్ ట్రిగనామెట్రీ, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్స్ ప్రతి ఫార్ములానూ వాటి అప్లికేషన్స్‌నూ ఎంత ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమయ్యారో చెక్ చేసుకోవాలి.

ఇంతకుమించి ఏం అక్కర్లేదు. ఎంత ఎక్కువ సన్నద్ధమయ్యారు అనేదానికన్నా ఎంత బాగా, కచ్చితంగా సన్నద్ధమయ్యారు అన్నదానికే ప్రాధాన్యం ఇవ్వాలి. మేథ్స్‌లో మొదటి 15 నిమిషాల్లో విద్యార్థి కచ్చితమైన, 100% తప్పు లేకుండా సమాధానం చేయగలిగే 10 ప్రశ్నలను ఎంచుకుంటే విజయం తథ్యం. ఎందుకంటే ఆ 10 ప్రశ్నల ద్వారా సులువుగా 40 మార్కులు స్కోరు చేయొచ్చు. అప్పటివరకూ ఆందోళనతో కూడి ఉన్న మానసిక స్థితిపై పట్టు సాధ్యమవుతుంది. అది మిగిలిన ప్రశ్నలను ప్రయత్నించడానికి దోహదపడుతుంది. ఇక మిగిలిన 10 ప్రశ్నలను జాగ్రత్తగా ఎన్నుకోవడంలోనే విద్యార్థి విజయం ఆధారపడి ఉంటుంది.

ఆఖరి ప్రయత్నంగా..

- మెయిన్స్ పరీక్షకు ముందు రాబోయే కొన్ని రోజుల్లో కొత్తగా చదివి నేర్చుకోవడమనేది సరికాదు. తెలిసిన విషయాలనే మననం చేసుకోవాలి.
- విషయ సారాంశాన్ని కన్సాలిడేట్ చేయాలి. పునశ్చరణ చేయాలి. ■ ప్రశ్నను, దాంతోపాటు జవాబులను చదివి అర్థం చేసుకునే ఓర్పు పెంచుకోవాలి. ■ సాధన కోసం కనీసం రోజు విడిచి రోజు రోజుకు రెండుసార్లు 3 గంటలు పరీక్షను రాసి, సమయపాలన పెంచుకోవాలి. ■ జవాబు తేవడంలోనూ, కచ్చితంగా గుర్తించడంలోనూ జరిగే పొరబాట్లను నివృత్తి చేసుకోవాలి.
- విద్యార్థికి వచ్చే అనుమానాలు, అవగాహనలోపాలు, జవాబులు రాబట్టే విధానంలో జరిగిన తప్పులను ఒకచోట పొందుపరచుకుని సబ్జెక్టువారీగా ఉపాధ్యాయులతో సంశయ నివృత్తి చేసుకోవాలి. ■ ప్రతిరోజూ 7 గంటల గాఢ నిద్ర అలవరచుకోవాలి. అలసటను పోగొట్టుకోవాలి.

గణితం

జేఈఈ మెయిన్ వంటి జాతీయస్థాయి పోటీపరీక్షలో కీలకపాత్ర మ్యాథ్స్‌దే. ఇదంతా కాల్‌క్యులేషన్స్, ఫార్ములాలపై ఆధారపడి ఉంటుంది. సీబీఎస్‌ఈ 11, 12 తరగతుల సిలబస్, మన తెలుగు రాష్ట్రాల ఇంటర్ బోర్డు సిలబస్సే జేఈఈ మెయిన్ ప్రవేశపరీక్షకు ఉన్నా అందులో ఏయే అధ్యాయాలను కచ్చితంగా చదవాలి, వేటిని చదవకూడదు అనే అంశాలపై స్పష్టత అవసరం.

ఎం. ఉమాశంకర్
శ్రీ చైతన్య విద్యాసంస్థలు

జేఈఈ మెయిన్ 360 మార్కులకు నిర్వహిస్తారనీ అందులో మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కోదాని నుంచి 120 మార్కులకు ప్రశ్నలు వస్తాయనీ తెలిసిన విషయమే. పైన చెప్పిన జేఈఈ మెయిన్ కటాఫ్ మార్కులను గమనిస్తే కేవలం ఒక్క మ్యాథ్స్‌ను గట్టిగా ప్రిపేర్ అయినా జేఈఈ మెయిన్‌లో సులువుగా అర్హత సాధించవచ్చని తెలుస్తుంది. దానికోసం చివరి ఈ వారం పదిరోజుల్లో విద్యార్థి సన్నద్ధత సరైన స్థాయిలో ఉందా లేదా అని తెలుసుకోవచ్చు.

చెక్‌లిస్ట్

ఆల్జీబ్రా: దీని నుంచి జేఈఈ మెయిన్‌లో సుమారుగా 35% ప్రశ్నలు వస్తాయి. అందులో ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్ నుంచి బేసిక్ మోడల్స్ అన్నీ కవర్ చేశారా లేదా? అలాగే ఇదే అధ్యాయం నుంచి పాత జేఈఈ, అడ్వాన్స్‌డ్ ప్రశ్నపత్రాలను పూర్తి చేశారా? అనేది ఆలోచించుకోవాలి. కాంప్లెక్స్ నుంచి జామెట్రికల్ అప్లికేషన్స్ చేశారా? మాడ్యులస్ అండ్ యాంప్లిఫైడ్ కాన్సెప్ట్‌పై పట్టు ఉందా? రొటేషన్ ఫార్ములాను ఎక్కడ ఉపయోగిస్తున్నారు? దానిపై, దాని అప్లికేషన్స్‌పై ఎంతవరకూ స్పష్టత ఉంది?

మాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్ చాలా సులువైనప్పటికీ లీనియర్ ఈక్వేషన్స్ సాధనపై ఎంత వరకూ స్పష్టత ఉంది? ఎడ్జాయింట్, డిటర్మినెంట్ ప్రాపర్టీస్‌పై పూర్తి పట్టుందా? సీక్వెన్స్ అండ్ సిరీస్, లాగరిథమ్స్, మేథమేటికల్ రీజనింగ్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్‌పై ఉన్న అన్ని ఫార్ములాలు, వాటి అప్లికేషన్స్, అందులోని స్టాండర్డ్ మోడల్స్ సాధనతోపాటు ఈ అధ్యాయాలపై పాత ప్రశ్నపత్రాల సాధన ఎంతవరకు వచ్చిందో చూసుకోవాలి.

కాల్‌క్యులస్: జేఈఈ మెయిన్‌లో దీని నుంచి సుమారుగా 30% పైగా ప్రశ్నలు రావడానికి ఆస్కారం ఉంది. కాల్‌క్యులస్‌లో ఎక్కువ శాతం డైరెక్ట్ ప్రశ్నలు అడుగుతున్నారు. అయితే డెఫినెట్ ఇంటిగ్రేషన్, ప్రాపర్టీస్, ఏరియాస్ ఆఫ్ కర్వ్స్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తేనే ఈ అధ్యాయం నుంచి వచ్చే ప్రశ్నలపై ఎక్కువ మార్కులు తెచ్చుకోవడం సాధ్యం. రిలేషన్స్ బిట్వీన్ కంటిన్యుటీ అండ్ డిఫరెన్సియేషన్, వాటి ప్రాపర్టీస్ చాలా ముఖ్యం. వీటిపై పట్టు రావాలంటే పాత జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పేపర్లలో ఈ అధ్యాయంపై ఉన్న ప్రశ్నలను సాధన చేశారో లేదో చెక్ చేసుకోవాలి. అలాగే మ్యాక్సిమా అండ్ మినిమా, టాన్‌జెంట్ అండ్ నార్మల్స్‌తోపాటు మీన్ వాల్యూ థీరమ్‌ల నుంచి అన్ని ఫార్ములాలు, థీరమ్స్ సాధన చేశారో లేదో కూడా పరిశీలించుకోవాలి.

కోఆర్డినేట్ జామెట్రీ: దీని నుంచి 10% ప్రశ్నలు వస్తాయి. ముఖ్యంగా సీనియర్ ఇంటర్ అంశాలైన సర్కిల్స్, కానిక్ సెక్షన్స్ బేసిక్ ఫార్ములాలు, వాటి టాన్‌జెంట్స్, నార్మల్స్ అప్లికేషన్స్ చేశారా? అలాగే అధ్యాయాలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలను ఓసారి గుర్తుచేసుకోవాలి. ఎన్‌సీఈఆర్‌టీలో ఈ అధ్యాయాలపై ఇచ్చిన ఫిజికల్ అప్లికేషన్ ప్రాబ్లమ్స్ సాధన చేశారో లేదో కూడా చూసుకోవాలి.

రసాయనశాస్త్రం

మేథ్స్, ఫిజిక్స్‌లతో పోలిస్తే కెమిస్ట్రీ ప్రశ్నలు సాపేక్షంగా సులువుగా ఉండే అవకాశం ఎక్కువ. పాఠ్యాంశాలపై అవగాహన ఉన్నవారికి ప్రశ్నలను సాధించడానికి పట్టే సమయం కూడా తక్కువ. పరీక్ష కాలంలో మూడో వంతు ఒక గంట రసాయన శాస్త్రానికి ఉంటుంది. ఇందులో 10 నిమిషాల వరకు మిగిల్చుకుని మిగిలిన రెండు విభాగాల్లో వాడుకోవచ్చు.

మళ్లీ మళ్లీ మననం

ఎ) వెయిటేజీ కొంచెం తక్కువని అకర్బన శాస్త్రాన్ని తక్కువ చేయకూడదు. అందులోనూ ఈ కొద్ది రోజులు పునశ్చరణ చేసేవారు ఇప్పుడు దీనిమీద ఎక్కువ దృష్టిసారించి రోజూ ఓ గంట భావనలను మననం చేసుకోవడం చాలా మంచిది. తద్వారా జ్ఞాపకశక్తిని మెరుగుపరచుకోవచ్చు.

బి) కర్బన రసాయన శాస్త్రానికి సంబంధించి నాలుగైదు రోజులు రోజుకో గంట మననం చేసుకోవాల్సినవి..

1. చర్య మాధ్యమికాలు, చర్య కారకాలు
2. ప్రతిక్షేపణ చర్యలు- రకాలు- ఉదాహరణలు
3. సంకలన చర్యలు- రకాలు- ఉదాహరణలు
4. నేమ్ పేరున వచ్చే చర్యలు

వరుసగా గొలుసు చర్యలు ఇచ్చినపుడు వాటిని విశ్లేషించి పదార్థాలు కనుక్కోవడం, చర్యలు రాయగలగడం ముఖ్యం. త్రిమితీయ విశ్లేషణ, క్షేత్ర సాదృశ్యం కొంచెం కఠినమైనవి. నమ్మకం తక్కువ ఉన్నప్పుడు

ఈ సమయంలో వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది.

సి) భౌతిక రసాయన శాస్త్రం, ఆవర్తనాల దృష్ట్యా దాదాపు భౌతికశాస్త్రాన్ని పోలి ఉంటుంది. నాలుగైదు రోజులపాటు ఇందులోని భావనలు గుర్తుకు తెచ్చుకుని ముఖ్యమైన సూత్రాలను రాసుకోగలగాలి. పరీక్షలో లెక్కలు వచ్చినపుడు అంకెలను ఏవిధంగా ప్రతిక్షేపించి సూక్ష్మీకరించాలో గుర్తు చేసుకోవడం ముఖ్యం.

భౌతిక రసాయన శాస్త్రంలో స్టాయికియోమెట్రీ గణనాలు, అయానిక సమతాస్థితి అంశాలపై కఠినమైన అనువర్తనాలు ఉంటాయి. కష్టమైన ఈ రెండు విషయాలను ఇప్పుడు పట్టించుకోకపోయినా పెద్ద నష్టం ఉండదు.

డి) ప్రయోగశాల విధానాలకు సంబంధించి కూడా ప్రశ్న(లు) వచ్చే అవకాశం ఉంది. కానీ దీనిని గుర్తించి, ఈ చివరి రోజుల్లో చేయాల్సిన ప్రత్యేక అభ్యాసం ఏమీలేదు.

మాదిరి పరీక్షలు

ఏప్రిల్ నెల మొదటి వారంలో రోజువిడిచిరోజు గణితం, రసాయన, భౌతికశాస్త్రాలు మూడింటిలోనూ 90 ప్రశ్నల 3 గంటల మాదిరి పరీక్ష రాసి, కీ షీట్‌తో సమాధానాలను పోల్చుకోవాలి. తప్పు చేసిన ప్రశ్నలను గుర్తించి, అందుకు గల కారణాలను విశ్లేషించుకుంటే జేఈఈ మెయిన్ రాయడంలో కొంత తోడ్పడుతుంది.

డా. మన్నం కృష్ణమూర్తి
వర్సిటీ ఎడ్యుకేషన్ లిమిటెడ్

ప్రశ్నలస్థాయి

జేఈఈ మెయిన్ అంత కష్టమైంది కాదు. ప్రతి ప్రశ్నకు సగటున రెండు నిమిషాలు ఉంటుంది. రసాయన శాస్త్రంలోని సగం ప్రశ్నలకు ఒక్కో నిమిషం సరిపోవచ్చు. రెండు నిమిషాలు సరిపోని కష్టమైన ప్రశ్నలు 2 లేదా 3 మాత్రమే ఉండే అవకాశముంది.

కెమిస్ట్రీ ప్రశ్నలస్థాయి కూడా తక్కువగానే ఉండే అవకాశముంది. దాదాపు సగం ప్రశ్నలు చాలా తేలికగా ఉండొచ్చు. 10 ప్రశ్నల వరకు మధ్యస్థ స్థాయిలో ఉండొచ్చు. 3-4 ప్రశ్నలు మాత్రమే కష్టంగా ఉండొచ్చు.

చివరగా..

- కొత్తగా చదివే ప్రయత్నాలు మాని, వచ్చిన విషయాలనే మళ్లీ గుర్తుచేసుకోవడం మంచిది.
- పునశ్చరణ చేసేటప్పుడు, చదువుతున్నపుడు ఇవన్నీ వచ్చు అనిపిస్తుంటాయి. అయితే పేపర్‌పై నోట్స్‌గా రాయగలిగితే కేంద్రీకరణ పెరుగుతుంది.
- కర్బన, అకర్బన రసాయన శాస్త్రాల్లో వచ్చిన సమీకరణాలను మరోసారి రాసి, సరిచేసుకోగలగడం చాలా మంచిది. ఏ పదార్థం ఏ కారకంతో చర్య జరుపుతుంది, చర్య పరిస్థితులు, చర్య ఉత్పన్నాలు తేలికగా గుర్తొస్తాయి.
- కొన్ని ప్రశ్నలకు సరైనవి కాని 3 జవాబులు గుర్తిస్తే సరైన జవాబు మిగులుతుంది. అయితే లాటరీ వేయొద్దు. మైనస్ మార్కులున్నాయి.
- పరీక్ష కష్టంగా ఉండదు. ఎలా ఉంటుందో అనే ఆందోళన, చాలా బాగా రాయాలనే అత్యాశ పరీక్షను కష్టంగా ఉండేలా చేస్తాయి.
- జేఈఈ మెయిన్‌లో చాలా మార్కులు తెచ్చుకోవడం కొందరికే సాధ్యమని సగటు విద్యార్థి గుర్తించాలి. సగం ప్రశ్నలు సరిగా జవాబు చేయగలిగితే ఎన్‌ఐటీల్లో ప్రవేశం లభిస్తుంది. నాలుగోవంతు ప్రశ్నలు సరిగా చేయగలిగితే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు క్వాలిఫై అవుతారు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

దిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ

పోస్టులు: అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, **ఖాళీలు:** 39
అర్హత: సంబంధిత విభాగాల్లో పీజీ/ పీహెచ్‌డీతోపాటు అనుభవం.
వయసు: అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు 45 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్/ ప్రజెంటేషన్/ ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **చివరితేదీ:** 21.05.2018
http://recruitment.dtu.ac.in/faculty-prof/

ప్రవేశాలు

ఏపీడీఈఈసెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో డీఈఎల్‌ఈడీ కోర్సులో ప్రవేశానికి పాఠశాల విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది. **కోర్సు:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ)
కాలవ్యవధి: 2 సంవత్సరాలు (2018-2020)
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
ఎంపిక: డీఈఈసెట్ ద్వారా.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 28.03.2018
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 12.04.2018
వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు: మార్చి 28 నుంచి
వెబ్‌సైట్: http://cse.ap.gov.in/
https://apdeecet.apcfss.in/

ఆర్‌జీఎన్‌ఐవైడీ, శ్రీపెరంబదూరు

సంస్థ: రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ (ఆర్‌జీఎన్‌ఐవైడీ), శ్రీపెరంబదూరు, తమిళనాడు.
కోర్సులు: యూజీ (మూడేళ్లు), పీజీ (రెండేళ్లు), పీజీ డిప్లొమా (ఏడాది) **విభాగాలు:** కౌన్సెలింగ్ సైకాలజీ, జెండర్ స్టడీస్, యూత్ డెవలప్‌మెంట్, సోషల్ వర్క్ తదితరాలు. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత. **ఎంపిక:** ప్రవేశపరీక్ష, అకడమిక్ ప్రతిభ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 25.04.2018
వెబ్‌సైట్: http://www.rgniyd.gov.in/

ఫెలోషిప్స్

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రిసెర్చ్, గాంధీనగర్

ఫెలోషిప్: జేఆర్ఎఫ్-2018 ఫర్ పీహెచ్‌డీ
స్టైపెండ్: మొదటి రెండేళ్లు జేఆర్ఎఫ్ కింద నెలకు రూ.25,000, తర్వాతి ఏడాది నుంచి ఎస్ఆర్ఎఫ్ కింద నెలకు రూ.28,000, ఇతర అలవెన్సులు. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఎస్సీ/ జెస్ట్/ గేట్/ సీఎస్ఐఆర్-యూజీసీ - జేఆర్ఎఫ్-నెట్.
వయసు: 26 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: రెండు దశల ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 15.04.2018
వెబ్‌సైట్: http://www.ipr.res.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

కథలా చదివా... సాధనతో గెలిచా!

ఇంజినీరింగ్ అంటే కొందరికి ఆవిష్కరణల స్వర్గం.. మరికొందరికి కొలువుల మార్గం. అయితే అతడికి మాత్రం అది సేవాభావం వైపు మరల్చిన సాధనం. పేదలకు మేలు చేయాలన్న తపనతో అత్యున్నత కొలువు సాధించాలనుకున్నాడు. చివరకు కళాశాల స్ఫూర్తితో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పాడు. పోటీపరీక్షల యజ్ఞంలో విజయం సాధించాడు. ఇటీవల ప్రకటించిన ఏపీపీఎస్‌సీ గ్రూపు-1 ఫలితాల్లో తిరుపతికి చెందిన **గజ్జెల రామచంద్ర మధుసూదన్** ఓపెన్ కేటగిరీలో రెండో ర్యాంకు సాధించాడు. తన విజయానికి పడిన శ్రమ... సంసిద్ధతలను 'చదువు'తో ఇలా పంచుకున్నాడు..

వాకాడులోని ఎన్‌ఆర్‌వీఆర్ కళాశాలలో ఇంజినీరింగ్ (ఈసీఈ) చదువుకున్నాను. మూడో సంవత్సరం చదువుతుండగా ఒకరోజు కళాశాలకు అంధుల బృందం వచ్చింది. చూసి నా మనసు చలించిపోయింది. ఆ సమయంలోనే నా దగ్గర ఉన్న పాకెట్‌మనీతోపాటు స్నేహితుల సాయం తీసుకొని 'ఐక్రాస్' అనే సంస్థను నెలకొల్పాను. దీనిద్వారా ఇప్పటివరకూ 15 వేల మందితో నేత్రదానానికి అంగీకరిస్తూ సంతకాలను చేయించాం. 108 సదస్సులను పెట్టాం. 120 మంది కార్నియాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు అందించాం. ఇప్పటికీ మా సంస్థ విద్యార్థుల పాకెట్‌మనీతోనే నడుస్తోంది. ఆ సమయంలోనే నేను పేదల కోసం సివిల్స్ రాయాలనుకున్నాను. మంచి ఉద్యోగం వస్తే పేదలకు సేవ చేయవచ్చనేది నా భావన.

గ్రూపు-1 రెండో ర్యాంకరు రామచంద్ర మధుసూదన్

హైదరాబాద్ వచ్చేశా...

బీటెక్ అవగానే టీసీఎస్‌లో ఉద్యోగ అవకాశం వచ్చింది. అయితే సివిల్స్ లక్ష్యం సాధించాలని హైదరాబాద్ ఆర్‌సీ రెడ్డి అకాడమీలో చేరాను. బాగా సిద్ధమయ్యాను. 2014లో ప్రిలిమ్స్ పూర్తయింది. అయితే మెయిన్స్ పోయింది. తర్వాత గ్రూపు-2 రాశాను. దానిలో విజయం సాధించి.. సీనియర్ ఆడిటర్ పోస్టుకు ఎంపికయ్యాను.

అంతలోనే గ్రూపు-1 నోటిఫికేషన్ పడింది. దీంతో దీనివైపు దృష్టి పెట్టాను. గ్రూపు-1 సిలబస్ చాలా కొత్తగా అనిపించింది. ముఖ్యంగా ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్, చరిత్ర, కరెంట్ ఎఫైర్స్ వంటివి క్లిష్టంగా.. సవాల్‌గా అనిపించాయి. ఏ చిన్న సందేహం వచ్చినా... వెంటనే నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకోనేవాణ్ణి. సిలబస్‌ను కేవలం ప్రశ్న, జవాబు, గుర్తుల రూపంలో కాకుండా... దానిలోని సారాంశాన్ని ఒక కథ రూపంలో అర్థం చేసుకునేవాణ్ణి. దీనివల్ల పాఠం అంటే ఇష్టం పెరగడమే కాకుండా... గుర్తుండిపోయింది. ఈ పద్ధతి నాకు బాగా ఉపయోగపడింది.

ఎకానమీ ఇబ్బంది పెట్టింది

నాకు బాగా క్లిష్టమైన సబ్జెక్టు ఎకానమీనే. దీనిపై నేను భారీ కసరత్తు చేసేవాణ్ణి. ఏవి పడితే ఆ పుస్తకాలు కొనేయకుండా... సిలబస్‌కు సంబంధించిన ఒకటి, రెండిటినే నమ్ముకునేవాణ్ణి. దానిలో విషయం అర్థం చేసుకొని.. ఏదైనా తెలియని విషయాలుంటే సుబ్బారావు అనే నిపుణుడిని అడిగేవాణ్ణి. ఎవరైనా సరే తెలియని విషయాలు, పదాలను అక్కడితో వదిలేయకూడదు. దానిలోని అంతరార్థం తెలుసుకోవాలి. అది భవిష్యత్తులోనూ ఉపయోగపడుతుంది.

సిలబస్‌లోని విషయాలను చదవడం, గుర్తుపెట్టుకోవడం ఒక ఎత్తయితే పరీక్షను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవటం మరో ఎత్తు. ఒక్కో నెలలో అయితే ప్రతిరోజూ టెస్ట్ పేపర్లు రాసేవాణ్ణి. దానివల్ల ఎక్కడ లోపాలున్నాయో తెలిసేది. వెంటనే వాటిని సరిదిద్దుకునేవాణ్ని. ఇక పరీక్ష రాసిన ప్రతిసారీ 'ర్యాంకు వస్తుందా.. లేదా?' అని బేరీజు వేసుకోవడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. సక్రమంగా కృషి చేస్తే ఫలితం వస్తుందని మాత్రమే గుర్తుంచుకోవాలి.

ముఖాముఖి ఇలా...

నా ఇంటర్వ్యూ సుమారు 30 నిమిషాలు సాగింది. చివరి వ్యక్తిని నేనే కావడంతో బోర్డు సభ్యులు ఎక్కువ సమయం ఇచ్చారు. మాది తిరుపతి కావడంతో తిరుపతి కొండలు ఎన్ని..? వాటి పేర్లేమిటని అడిగారు..? శేషాచలంలో ఎక్కువగా దొరికే విలువైన వృక్షాలు ఏమిటి..? వాటిని ఎందుకు స్మగ్లింగు చేస్తారు అని అడిగారు. జీవ వైవిధ్యం గురించి కొన్ని ప్రశ్నలు సంధించారు. ఎక్కువగా నా స్వచ్ఛంద సంస్థ విశేషాలను ప్రశ్నించారు. ఎక్కడా తడుముకోకుండా... జవాబు తెలిస్తే తెలుసు నని.. లేకుంటే లేదు అని నిజాయతీగా చెప్పాలి. ఇది ముఖాముఖిలో చాలా ముఖ్యం.

- శివ మావూరి, ఈనాడు- తిరుపతి

'ఈనాడు' చేసిన మేలు

పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేవారు పత్రికలు చదవడం తప్పనిసరి. నేను 'ఈనాడు' ఎడిటోరియల్ పేజీని ఎక్కువ ఫాలో అయ్యేవాణ్ని. అక్కడ ఉండే వ్యాసాలు నాకు మేలు చేశాయి. దానిలోని మంచి విషయాలను నోట్ చేసుకునేవాణ్ణి. గ్రూప్-1 ప్రధాన పరీక్షలో వ్యాసరూప ప్రశ్నల్లో అద్దె గర్భం, మహిళా సాధికారత, రాయలసీమ వెనుకబాటు గురించి వచ్చిన ప్రశ్నలకు ఈనాడులో వచ్చిన కథనాలనే రాశాను. అవే నన్ను గట్టెక్కించాయి.

సిలబస్‌ను విభాగాలుగా చేసుకోండి. దాన్ని ఎలా... ఎప్పుడు పూర్తి చేయాలో ఒక చార్టును తయారు చేసుకోండి. ఇక ప్రభుత్వ సర్వేలు, లెక్కలు అవసరం. ఇవి వ్యాసరూప ప్రశ్నలకు సూటిగా సమాధానం ఇవ్వడానికి అవసరం అవుతాయి. దీనికోసం అంతర్జాలంలో శోధించవచ్చు. నమ్మకమైన సైట్లను ఎంచుకొని.. వాటిలోని సమాచారాన్ని అనుసరించాలి. ఏపీ మ్యాగజీన్, పీఐబీ సైట్లను బాగా చూసేవాణ్ణి.